క్లుప్తంగా

వృద్ధులు, అనాథలను ఆదుకోవడం సామాజిక బాధ్యత

అదనపు ఎస్పీ హనుమంతు



గుంటూరు ఎడ్యుకేషన్: సమాజంలో నిరాదారణకు గురైన వృద్ధులను, అనాథ బాల, బాలికలను ఆదుకోవడం సామాజిక బాధ్యతగా ఉండాలని అదనపు ఎస్పీ ఎ.హనుమంతు పేర్కొన్నారు. రవీంద్రనగర్‌లోని మాతృశ్రీ చిల్డ్రన్స్ హోం, శ్రీనగర్‌లోని మాతృశ్రీ వృద్ధాశ్రమాలకు హైదరాబాద్‌కు చెందిన రిలేబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మూడు నెలలకు సరిపడా నిత్యావసరాలతో పాటు ఫ్యాన్లు, పుస్తకాలు, బ్యాగులు, చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. శనివారం నిర్వహించిన కార్యక్రమంలో రిలేబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు రవి మాట్లాడుతూ భగవంతుడు ఇచ్చిన ఆదాయంలో కొంత మొత్తాన్ని పేద ప్రజలకు, నిరాదరణకు గురైన వారికి అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వృద్ధుల, చిల్డ్రన్ హోమ్ నిర్వాహకులు నడింపల్లి శైలజ, విజయప్రసాద్, జీవన్ కాంత్ పాల్గొన్నారు.

అహల్య ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు



గుంటూరు మెడికల్: పొన్నూరు నియోజకవర్గం వేజెండ్ల కృష్ణ మందిర్ గురునాథ్ హోటల్ దగ్గర శనివారం అహల్య ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ శనక్కాయలు రాజకుమారి మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలను పేద ప్రజలు వినియోగించుకోవాలన్నారు. శిబిరంలో సుమారుగా 250 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. గర్భిణులు ఎండాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తల్లీబిడ్డ క్షేమంగా ఉండి సులువు ప్రసవం అయ్యే మార్గాల గురించి వ్యాయామం గురించి, ఆహార జాగ్రత్తలు తల్లి తీసుకోవాల్సిన వ్యాక్సినేషన్ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ సిరి అహల్యా హాస్పిటల్ సిబ్బంది, సర్పంచి హైమావతి, టీడీపీ ఇన్‌చార్జ్ బసవయ్య, రవి, ఆర్.ఎం.పి బ్రహ్మం, శ్రీనివాస్, సురేష్ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి



నెహ్రూనగర్: మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని గుంటూరు జిల్లా ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ మారయ్యబాబు తెలిపారు. శనివారం మాదక ద్రవ్యాల వలన కలిగే నష్టాలపై ప్రజలకు నగరంలో అవగహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే విచక్షణ కోల్పోయి నేరాలకు పాల్పడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. తద్వారా వారి బంగారు భవిష్యత్ ప్రశ్నార్థకంగా ఉంటుందని చెప్పారు. యువతపై తల్లిదండ్రులు శ్రద్ధ ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో గుంటూరు– 1 టౌన్ సీఐ లత, 2 టౌన్ సీఐ యశోధరదేవి పాల్గొన్నారు.

అలరించిన వాగ్గేయకారుల కీర్తనల గానం



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై శనివారం గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్ స్మృత్యాంజలి కీర్తనల గానం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. చింతలపాటి రమాగోపాలకృష్ణ, పావని, నాగలక్ష్మి తమ గాత్ర ధారణలో నమిత దేవభజే, నరులాలా నేడువో నారసింహ జయంతి, వేదములే నీనివాసమట, వాడవో ప్రహ్లాదవరదుడు, అనిశము తలచరో అహోబిలం వంటి కీర్తనలు ఆలపించారు. సభికులను అలరించాయి. వయోలిన్‌పై గోవర్ధనరావు, మృదంగంపై జగన్మోహిని వాయిద్యాన్ని అందించారు.

నేటి నుంచి శ్రీలక్ష్మీ నరసింహుని కల్యాణ మహోత్సవాలు

గుంటూరు రూరల్: మండలంలోని నల్లపాడులో కొలువైన శ్రీ పుష్యాద్రి లక్ష్మీ నరసింహస్వామి, ఆకాశ మల్లేశ్వరస్వామి క్షేత్రాల్లో ఆదివారం నుంచి స్వామి కల్యాణ మహోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ శనివారం ప్రకటనలో తెలిపారు. ఉదయం సుప్రభాతసేవ, లలితా పారాయణం, పూలంగి సేవ, సహస్ర దీపాలంకరణ.. రాత్రి 8 గంటలకు స్వామివారి శాంతి కల్యాణ మహోత్సవం జరగనుందని తెలిపారు.

ఈదడానికి తరలివస్తున్నారు..

ఈతతో ప్రయోజనాలెన్నో..

- ఎన్‌టీఆర్ స్విమ్మింగ్ పూల్‌లో సందడి
- ఉత్సాహంగా చిన్నారులు, పెద్దలు
- జాగ్రత్తలు పాటిస్తే ఆరోగ్యంతో పాటు ఉజ్వల భవిష్యత్
- ఈ నెల 31వ తేదీ వరకు సమ్మర్ క్యాంప్



శిక్షణ ఇస్తున్న కోచ్

నెహ్రూనగర్/లక్ష్మీపురం: వేసవి వచ్చిందంటే చిన్నారులకు పండగే. కాలువలు కనిపిస్తే స్నేహితులతో కలసి ఈతకు వెళ్తుంటారు. పరవశించిపోతారు. పెద్దలు తక్కువేవి కాదండి.. అవకాశం దొరికితే కాలువ ప్రవాహంలో దూకి అలా.. ఈదేస్తుంటారు. అయితే నగరవాసులు కొలనులు అందుబాటులోకి వచ్చాయి. అందుకు అనుగుణంగా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో శ్యామలనగర్‌లోని ఎన్టీఆర్ స్విమ్మింగ్ పూల్ వేసవి సెలవులను దృష్టిలో ఉంచుకుని సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నారు. అంతే కాకుండా నగరంలో, శివారు ప్రాంతాల్లో ప్రైవేట్ ఈత కొలనులు కూడా ఉన్నాయి. కొలనుల వద్ద శిక్షకులు ఉండి శిక్షణ ఇస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రతి రోజు 600 మంది ఈత ప్రాక్టిస్‌కు వస్తున్నారు.

అనేక ప్రయోజనాలు..

పిల్లలకు ఈత ఒక క్రీడ అయితే.. పెద్దలకు అది ఆరోగ్య సంజీవని. రోజులో కనీసం 30 నుంచి 40 నిమిషాల పాటు ఈత కొడితే ఎన్నో రకాల వ్యాధుల నుంచి బయటపడవచ్చు. ముఖ్యంగా ఊబకాయి సమస్య ఉండదు. మధుమేహం, రక్తపోటుతో బాధపడుతున్న వారికి ఈత మేలు చేస్తుంది. ఊహించని నీటి విపత్తులు ఎదురైనప్పుడు తమను తాము రక్షించుకోవడంతో పాటు ఇతరులకు సాయం చేసేందుకు ఈత దోహదపడుతుంది.

చిన్నారులకు ఎన్నో అవకాశాలు

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ఏటా ఈత పోటీలు నిర్వహిస్తోంది. స్విమ్మింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్ఎఫ్ఐ) కూడా అంతర్జాతీయ పోటీలకు పిల్లల్ని తీసుకెళ్లాలా తీర్చిదిద్దుతుంది. ఒలింపిక్స్, ఆసియా పోటీల్లోనూ ఈతకు చోటుండడంతో అంతర్జాతీయంగా రాణించే అవకాశం ఉంది.

పర్యవేక్షణ.. జాగ్రత్తలు ముఖ్యం

సాధారణంగా కొలను 3 నుంచి 10/12 అడుగుల లోతు ఉంటుంది. పిల్లల భద్రత దృష్ట్యా లైఫ్ జాకెట్లు తొడిగించి కొలనులో దించాలి. ఐదేళ్లు పైబడితేనే ఈత అలవాటు చేయాలి. వీరికి ప్రధానంగా తమను తాము నీటిలో రక్షించుకునే అంశాల్లో శిక్షణ ఇస్తారు. నెల నుంచి 45 రోజుల పాటు శిక్షణ పూర్తి చేసుకునే సరికి నీటిలో ప్రమాదాల నుంచి బయటపడేలా చిన్నారులు మారుతారు. అదే అలవాటుగా చేసుకున్న వారైతే ఎన్నో రకాల జల క్రీడల వైపు అడుగులేసే అవకాశం ఉంది. బాలురు నైలాన్ షర్ట్, తలక క్యాప్, స్విమ్మింగ్ కళ్లజోడుతో ఈతకు దిగాలి. అదే బాలికలకు ప్రత్యేకంగా స్విమ్ సూట్లు మార్కెట్‌లో ఉన్నాయి. కొలనులో దిగే ముందు.. ఈత తరువాత కచ్చితంగా స్నానం చేయాలి. సామర్థ్యానికి మించి ఎక్కువ మంది ఒకేసారి ఈతకు దిగడం మంచిది కాదు. 25/15 మీటర్ల విస్తీర్ణంలో కొలను ఉంటే గరిష్ఠంగా ఒక విడతో 40 మందికి మించి ఈత కొట్టకూడదు.



ఈతకు సిద్ధమవుతున్న చిన్నారులు

స్విమ్మింగ్ అంటే చాలా ఇష్టం



నాకు స్విమ్మింగ్ అంటే చాలా ఇష్టం. శ్యామలనగర్‌లో ఉన్న స్విమ్మింగ్ పూల్‌కు ప్రతి రోజు వచ్చి స్విమ్ చేస్తుంటాను. స్విమ్ చేయడం ద్వారా ఎంతో యాక్టివ్‌గా ఉన్నట్లు అనిపిస్తుంది.

–వై.మోక్ష అన్విదియ, శ్యామలనగర్

రెండో ఏడాది క్యాంప్‌కు వచ్చా...



నేను గత ఏడాది కూడా మా ఫ్రెండ్స్‌తో కలిసి సమ్మర్ క్యాంప్‌కు వచ్చా. నేను మూడో బ్యాచ్ సమయానికి వస్తున్నా. నేను పాతగుంటూరు నుంచి ఈ క్యాంప్‌కు వస్తున్నా. గత ఏడాది చాలా వరకు క్యాంప్‌లో నేర్చుకున్నా. ఈ ఏడాది కూడా క్యాంప్‌లో శిక్షకుల నుంచి మంచి శిక్షణ పొందుతున్నా.

– షేక్ అజీజుల్లా, 9వ తరగతి

సమ్మర్ క్యాంప్‌లో చిన్నారులకు ప్రత్యేక శిక్షణ



నగరపాలక సంస్థ ఈ నెల 31వ తేదీ వరకు సమ్మర్ క్యాంప్‌లు నిర్వహిస్తోంది. చిన్నారులకు ముందుగా ఫ్రీ స్టైల్ ట్రెనింగ్ ఇవ్వడం జరగుతోంది. ముందు 15 నిమిషాలు గ్రౌండ్ వర్క్అవుట్, 45 నిమిషాలు స్విమ్మింగ్ చేయిస్తుంటాం. 31వ తేదీన ఈత పోటీలు నిర్వహించి వారిలో ప్రతిభ కనపరిచిన వారికి మెడల్, సర్టిఫికెట్ బహూకరించనున్నాం.

– ఖాజా మొహిద్దున్, కోచ్

కూటమి హామీలు అమలు చేయాలి

సచివాలయం ఏఎన్ఎం రాష్ట్ర నాయకురాలు అన్నమ్మ



లక్ష్మీపురం: కూటమి ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సచివాలయ ఏఎన్ఎంల సంఘం(సీఐటీయూ) రాష్ట్ర నాయకురాలు కె.అన్నమ్మ డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టరేట్ వద్ద కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యల పరిష్కారం కొరకు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారానికి 13వ రోజుకు చేరింది. ఆమె మాట్లాడుతూ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా జనరల్ సెక్రటరీ పల్లపాటి లింగరాజు, వైస్ ప్రెసిడెంట్ జి.వనజ, ఏపీ ఎంసీఏ ట్రెజరర్ సంధ్య, కో ఆర్డినేటర్ దీక్షిత, జిల్లా నాయకులు రవితేజ, జహీర్ పాల్గొన్నారు.

చిత్ర పరిశ్రమపై ప్రభుత్వం దృష్టిసారించాలి

నగరంపాలెం: ఏపీలో రాజధాని ఎక్కడైతే అక్కడ చిత్ర పరిశ్రమను ఏర్పాటు చేయాలని మా–ఏపీ (మూవీ ఆర్టిస్టుల అసోసియేషన్ ఏపీ–24 విభాగాల యూనియన్) వ్యవస్థాపకులు, చిత్ర దర్శకుడు దిలీప్‌రాజా అన్నారు. గుంటూరు నగరంలోని ఓ హోటల్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అమరావతిలో సినిమాల చిత్రీకరణ కోసం స్టూడియోల నిర్మాణాలు చేపట్టాలని అన్నారు.

వీర జవాన్ మురళీ నాయక్‌కు ఘన నివాళి



లక్ష్మీపురం: భారత్– పాకిస్తాన్ యుద్ధంలో పుట్టపర్తి జిల్లాకు చెందిన మురళీ నాయక్ వీర మరణం చెందడం బాధాకరం అని ఏపీ పీసీసీ రాష్ట్ర డాక్టర్స్ సెల్ చైర్మన్ డాక్టర్ రాచకొండ జాన్‌బాబు అన్నారు. గుంటూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో లీగల్ సెల్, ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో శనివారం వీర జవాన్ మురళీనాయక్ చిత్రపటానికి పూల మాలలో నివాళులర్పించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సైనికులు వారి కుటుంబాలకు తగు విధంగా ప్రాధాన్యం కల్పించి అండగా నిలవాలన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకులు, జిల్లా ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు షేక్ కరీం ఘన నివాళులర్పించారు.

ఆక్రమణలు తొలగించిన ట్రాఫిక్ పోలీసులు



పట్నంబజారు: గుంటూరు ఈస్ట్ ట్రాఫిక్ సబ్ డివిజన్ పరిధిలో శనివారం ఆక్రమణలను ట్రాఫిక్ పోలీసులు తొలగించారు. ఈస్ట్ ట్రాఫిక్ సీఐ ఎ.అశోక్ ఆధ్వర్యంలో సిబ్బంది సాయంత్రం సమయంలో ఈస్ట్ ట్రాఫిక్ స్టేషన్ పరిసర ప్రాంతాలు, అన్న క్యాంటీన్, బ్రహ్మానందరెడ్డి స్టేడియం, కోడిగుడ్డు సత్రం, కింగ్ హోటల్, ప్రాంతాల్లో రోడ్డుకు అడ్డంగా పెట్టి వ్యాపారం చేస్తున్న తోపుబండ్లను పక్కకు జరిపించారు. రోడ్డుపై పెట్టి వ్యాపారం చేయడం వలన ట్రాఫిక్‌కు అంతరాయంతోపాటు, ప్రమాదాలకు కారణమవుతున్నారని తెలిపారు. ఇదేవిధంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ రవీంద్ర పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు యూటీఎఫ్ అభినందన

గుంటూరు ఎడ్యుకేషన్: పదో తరగతి పబ్లిక్ పరీక్షా ఫలితాల్లో పాఠశాల స్థాయిలో టాపర్లుగా నిలిచిన ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులను యూటీఎఫ్ ప్రతినిధుల బృందం అభినందించింది. శనివారం ప్రత్తిపాడు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ, జెడ్పీ ఉన్నత పాఠశాలల నుంచి టాపర్లుగా నిలిచిన విద్యార్థుల ఇళ్లకు వెళ్లిన యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు, గుంటూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖరరావు, ఎం.కళాధర్, జిల్లా, మండల కమిటీ నాయకులు, హెచ్ఎంలు కలిసి విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులను సన్మానించారు. ఈసందర్భంగా నక్కా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ భవిష్యత్‌లో ఎన్ని ఇబ్బందులు వచ్చినా పిల్లలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దాలని తల్లిదండ్రులకు సూచించారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని గ్రామస్తులను కోరారు. చదువుపై ధ్యాసతో చదివితే ప్రభుత్వ పాఠశాలలేమీ కార్పొరేట్ విద్యాసంస్థలకు తీసిపోవని అన్నారు. పాఠశాలస్థాయిలో టాపర్లుగా నిలిచిన ఎనిమిది విద్యార్థుల్లో ఆరుగురు బాలికలు ఉండటం విశేషమన్నారు. ఈసందర్భంగా కోయవారిపాలెం, తిక్కిరెడ్డిపాలెం, ప్రత్తిపాడు, మల్లాయపాలెం, వంగిపురంచ గొట్టిపాడు, చినకొండ్రుపాడు, యనమదల జెడ్పీ ఉన్నత పాఠశాలల పరిధిలోని విద్యార్థులను శాలువా కప్పి, జ్ఞాపిక, ప్రశంసాపత్రం, స్టీఫెన్ హాకింగ్ పుస్తకాన్ని ఇచ్చి అభినందించారు. ఆయా కార్యక్రమాల్లో పాఠశాలల హెచ్ఎంలు పి.విజయలక్ష్మి, కె.వెంకటేశ్వరరావు, జి.వేణుగోపాలరావు, యూటీఎఫ్ రాష్ట్ర ప్రచురణల విభాగ చైర్మన్ ఎం.హనుమంతరావు, రాష్ట్ర కార్యదర్శి మనోహర్, జిల్లా కార్యదర్శులు ఎండీ షకీలాబేగం, కె.ప్రేమ్ కుమార్, ఎం.గోవిందు, మండల అధ్యక్షుడు రవికుమార్, పాల్గొన్నారు.



ప్రత్తిపాడుకు చెందిన విద్యార్థినితో పాటు తల్లిదండ్రులను అభినందిస్తున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

16 కిలోల గంజాయి పట్టివేత

లక్ష్మీపురం: రైళ్ల ద్వారా వేరే రాష్ట్రాలకు గంజాయిని తరలించి అధిక లాభాలకు విక్రయిస్తున్న నిందితుడిని జీఆర్పీ పోలీసులు చాకచక్యంగా అరెస్ట్ చేశారు. అతడి నుంచి 16 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. జీఆర్పీ పోలీసులు శనివారం తెలిపిన వివరాలు.. ఒడిశాకు చెందిన అజిత్‌కుమార్ జైన్, భోగా నాయక్ అక్కడ గంజాయిని కొనుగోలు చేసి అధిక లాభాలకు గుజరాత్ రాష్ట్రంలోని సూరత్‌లో విక్రయించేందుకు రైలులో బయలుదేరారు. సమాచారం తెలుసుకున్న రైల్వే డీఎస్పీ పి.అక్కేశ్వరరావు ఆధ్వర్యంలో జీఆర్పీ సీఐ అంజిబాబు, ఐపీఎఫ్ సీఐ శంకరరావు, ఎస్ఐలు లక్ష్మీనారాయణరెడ్డి, ఆర్పీఎఫ్ సిబ్బంది ఎం.శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, కానిస్టేబుళ్లు ఎం.సోమశేఖర్, జి.వాసులు కలిసి గుంటూరు రైల్వేస్టేషన్ 1వ నంబర్ ప్లాట్‌ఫారంపై నిఘా పెట్టారు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో అజిత్‌కుమార్ జైన్‌ను జీఆర్పీ సీఐ అంజిబాబు సిబ్బందితో అదుపులోకి తీసుకున్నారు. అజిత్‌కుమార్ జైన్‌తో పాటు భోగానాయక్ అనే వ్యక్తి ఉన్నాడని, అతడు పరారైనట్లు పోలీసులు వెల్లడించారు. అతడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అజిత్‌కుమార్ జైన్‌పై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు.

900 గ్రాములు స్వాధీనం..

లక్ష్మీపురం: గంజాయి తీసుకుంటూ, విక్రయించే ఐదుగురిలో నలుగురిని అదుపులో తీసుకోగా ఒక వ్యక్తి పరారైన ఘటన అదుపులో తీసుకున్న నలుగురిని విచారిస్తున్న ఘటన శనివారం చోటు చేసుకుంది. విశ్వసనీయ సమాచారం మేరకు కృష్ణబాబు కాలనీ ప్రాంతంలో రాజేష్, అజయ్, దావిద్, అశోక్, వాసిమళ్ల వంశీకృష్ణలు కలిసి గంజాయి తీసుకోవడం, విక్రయించడం చేస్తున్నారు. నగరంపాలెం సిఐ నజీర్ బేగ్‌కు వచ్చిన సమాచారం మేరకు సిబ్బందితో హుటా హుటిన కృష్ణబాబు కాలనీలో గంజాయి సేవిస్తున్న వారిని అదుపులో తీసుకున్నారు. ఐదు గురిలో వాసిమళ్ళ వంశీకృష్ణ అనే వ్యక్తి పరారైయ్యాడు. మిగిలిన నలుగురిని పోలీసులు స్టేషన్‌కు తరలించి వారి వద్ద ఉన్న 900 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న వంశీకృష్ణ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేసేంత వరకు పోరాటం

జిల్లా కార్మిక సదస్సులో నాయకుల పిలుపు

లక్ష్మీపురం: కార్మికుల హక్కులకు భంగం కలిగించే నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేసేందుకు పోరాటం కొనసాగుతోందని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రమాదేవి పేర్కొన్నారు. ఈనెల 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె జయప్రదం కోరుతూ కార్మిక సదస్సు శనివారం నిర్వహించారు. కొత్తపేటలోని సీపీఐ జిల్లా కార్యాలయం మల్లయ్య లింగం భవన్‌లో నిర్వహించిన సమావేశానికి సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అరుణ్‌కుమార్ అధ్యక్షత వహించారు. తొలుత దేశ రక్షణలో వీర మరణం పొందిన మురళీనాయక్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ కార్మికుల హక్కులను హరించడమే లక్ష్యంగా కేంద్రంలో ఉన్నటువంటి ఎన్డీఏ ప్రభుత్వం పని చేస్తుందని ఆరోపించారు. బ్రిటిష్ వారితో పోరాడి సాధించుకున్నటువంటి కార్మిక చట్టాలను రద్దు చేస్తూ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్లను తయారు చేసి బలవంతంగా కార్మికులపై రుద్దే ప్రయత్నం చేస్తుందని పేర్కొన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ కుట్రపూరిత, కుయుక్తులను పోరాటంతోనే ఎదుర్కొంటామని ఈనెల 20న జరగబోతున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె ఎన్డీఏ ప్రభుత్వానికి చెంపపెట్టని అన్నారు. వైఎస్సార్టీయూ జిల్లా అధ్యక్షుడు పవన్ మాట్లాడుతూ దశల వారి ఆందోళనలతో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేసేంతవరకు పోరాటం నిర్వహిస్తామని చెప్పారు. 12, 13వ తేదీలలో వాణిజ్య, వర్తక సంఘాలకు సమ్మె నోటీసులు అందిస్తూ సహకారం కోరుతామని, 14,15 తేదీలలో ఆటోల ద్వారా గ్రామ గ్రామాన ప్రచారం నిర్వహిస్తామని, 17,18 తేదీలలో బైక్ ర్యాలీల ద్వారా ప్రజలకు సమ్మె యొక్క ప్రాధాన్యం తెలియజేస్తామని చెప్పారు. సదస్సులో ఏఐఎఫ్‌టీయూ న్యూ రాష్ట్ర నాయకులు కొరపాటి కోటయ్య, నాయకులు మేకల రవి, ఐఎఫ్టియూ రాష్ట్ర అధ్యక్షులు కృష్ణ మాట్లాడారు.



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

పేకాట స్థావరాలపై దాడులు

లక్ష్మీపురం: గుంటూరు వెస్ట్ సబ్ డివిజన్ పరిధిలో పేకాట స్థావరాలపై మెరుపు దాడులు నిర్వహించి నగదు స్వాధీనం చేసుకుని, పేకాట ఆడే వారిపై కేసులు నమోదు చేసిన ఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. అరండల్‌పేట, పట్టాభిపురం, నగరంపాలెం పోలీస్ స్టేషన్‌ల పరిధిలో పేకాటాడుతున్న స్థావరాలపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు వెస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ కె.అరవింద్ వెల్లడించారు. అరండల్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని అరండల్‌పేట 9వ లైన్‌లోని ఓ ఇంట్లో పేకాటాడుతున్న స్థావరంపై ఆకస్మిక దాడి చేశారు. 17 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.81,000 నగదు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకొని సీజ్ చేసి కేసులు నమోదు చేశారు. అదే విధంగా పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని బృందావన గార్డెన్స్ రోడ్‌లోని ఒక లాడ్జిలో పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు, దాడులు నిర్వహించి 10 మంది జూదరులను అరెస్ట్ చేశారు. వీరి వద్ద ఉన్న రూ.90,000 వేల నగదు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకొని కేసు సీజ్ చేసి కేసులు నమోదు చేశారు. ఈసందర్భంగా డీఎస్పీ అరవింద్ జూదరులకు కౌన్సెలింగ్ నిర్వహించి మాట్లాడుతూ జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఉత్తర్వుల మేరకు గుంటూరు వెస్ట్ సబ్‌డివిజన్ పరిధిలో ఉన్న మూడు పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించడం జరిగిందన్నారు.

నగరంలో శుభం చిత్ర బృందం సందడి

నగరంపాలెం: వినూత్న కథనంతో శుభం చిత్రాన్ని నిర్మించినట్లు ప్రముఖ నటి, చిత్ర నిర్మాత సమంత అన్నారు. శుభం చిత్ర యూనిట్ బృందం శనివారం రాత్రి శ్రీనివాసరావుపేట మెయిర్ రోడ్డులోని పినెక్స్ థియేటర్ (మైత్రి సినిమాస్)లో విజయోత్సవ యాత్రను నిర్వహించారు. ఇవీవీ కళా వాహిని, సురేష్ మూవీస్ సంయుక్త ఆధ్వర్యంలో విజయోత్సవ యాత్ర జరిగింది. శుభం చిత్రం పెద్ద విజయం సాధించిందని నిర్మాత, నటి సమంత అన్నారు. దర్శకుడు ప్రవీణ్, నటీనటులు హర్షిత్‌రెడ్డి, శ్రీనివాస్ చరణ్, శ్రియ, శర్వాణి, షాలినీలు హాజరై ప్రేక్షకులతో ముచ్చటించారు. చిత్ర యూనిట్‌ను సురేష్ మూవీస్ మేనేజర్ మాదల రత్తయ్య చౌదరి, ఇ.వి.వి యువకళా వాహిని అధ్యక్షుడు వెచ్చా కృష్ణమూర్తి సత్కరించారు.



ప్రేక్షకులతో ముచ్చటిస్తున్న నటి, చిత్ర నిర్మాత సమంత, చిత్ర బృందం



కృష్ణాశ్రమం ఎదురున్న రైల్వే ఓవర్‌బ్రిడ్జి కింద ఉన్న గార్డెన్ లోపల పాత వస్తువులు



అంకమ్మనగర్ వైపు బ్రిడ్జి కింద ఉన్న గార్డెన్‌లో కనిపించని పచ్చదనం

● ఆహ్లాదం.. ఆవిరి

సుందరీకరణకు నిర్లక్ష్యం చెద పట్టింది. ఆహ్లాదం కోసం ఏర్పాటు చేసిన చిన్నపాటి గార్డెన్‌లు నిరూపయోగంగా మారాయి. గతంలో పచ్చని చెట్లు, పూల మొక్కలతో అందంగా కనిపించగా, ప్రస్తుతం కళాహీనంగా తయారయ్యాయి. కంకరగుంట రైల్వే ఓవర్‌బ్రిడ్జి పిల్లర్ల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. మూడు లేదా నాలుగైదు పిల్లర్లకు ఒక గార్డెన్‌గా తయారు చేశారు. అప్పట్లో చుట్టు ఇనుప గ్రిల్స్‌తో ప్రహరీ నిర్మించారు. అందులో రకరకాల చెట్లు, అందమైన పూల మొక్కలను ఏర్పాటు చేశారు. జీఎంసీ అధికారులు పర్యవేక్షణకు సిబ్బందిని నియమించారు. మొక్కలకు నీళ్లు పెట్టడం, ఇతరులను లోనికి రాకుండా పర్యవేక్షణ చేసేవారు. ఇటీవల పిల్లర్లకు కూడా రంగులు వేయించి, అందమైన బొమ్మలతో ఆహా అనిపించేలా తీర్చిదిద్దారు. ప్రస్తుతం కళాహీనంగా మారాయి. కంకరగుంట రైల్వే గేటు నుంచి కలెక్టరేట్ వైపు వెళ్లే దారిలో ఇనుప గ్రిల్స్ బయటకు వచ్చి ప్రమాదకరంగా మారాయి. జీఎంసీ అధికారులు స్పందించి, ఆయా గార్డెన్‌లకు పూర్వ వైభవాన్ని తీసుకురావాలని స్థానికులు, నగర వాసులు కోరుతున్నారు.

– నగరంపాలెం



గార్డెన్‌లో తొలగించని చెత్త చెదారం

ఎంపీటీసీ కల్పన అరెస్టు దుర్మార్గమైన చర్య

నెహ్రూనగర్: రాష్ట్రంలోని పోలీసులు చట్టాన్ని ఉల్లంఘించి దళిత మహిళ అయిన ఎంపీటీసీ వలపర్ల కల్పనను అరెస్టు చేయడం దుర్మార్గమైన చర్య అని ఎమ్మార్పీస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సీహెచ్ శశికుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చట్ట ప్రకారం మహిళలను ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటలలోగా మాత్రమే అరెస్టు చేయాల్సి ఉన్నా నిబంధనలకు విరుద్ధంగా అరెస్టు చేయడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో దళిత మహిళలకు రక్షణ లేకుండా పోయిందని పేర్కొన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి చర్యలే పునరావృతమైతే ప్రభుత్వంపై తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు.